క్లుప్తంగా

గండి నిత్యాన్నదానానికి వితరణ



దాతకు ప్రసాదాలను అందజేస్తున్న ఆలయ అధికారి ముకుందరెడ్డి

చక్రాయపేట : గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి మంగళవారం రూ.25.116లు విరాళంగా వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి తెలిపారు. మైదుకూరు మండలం గడ్డమాయపల్లెకు చెందిన సిద్దారెడ్డి, రామసుబ్బమ్మల కుమారుడు సిద్ధేశ్వరరెడ్డి విరాళంగా ఇచ్చాడని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఉద్యోగ విజయోత్సవం

కమలాపురం : స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఉద్యోగ విజయోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.బి.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్, ట్రెనింగ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి హాజరు కానున్నారని ఆయన తెలిపారు. నిరుద్యోగులు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పంపిణీ

ముద్దనూరు : అనారోగ్యంతో చికిత్స చేయించుకున్న వ్యక్తికి మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందించారు. మండలంలోని పెనికలపాడు గ్రామానికి చెందిన పెద్ద సుబ్బరాయుడుకు రూ.2 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ బాలాంజనేయులు

వేముల : మండలంలోని గొందిపల్లె గ్రామంలో పులివెందులకు చెందిన సురక్ష ఐకేర్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఆపరేషన్లు అవసరమైన వారికి కడపకు తరలించి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తామని కంటి వైద్యులు డాక్టర్ బాలాంజనేయులు తెలిపారు. అలాగే కంటి అద్దాలు అవసరమైన వారికి పులివెందులలోని గోపివిహార్ వీధి పక్కన సురక్ష ఐకేర్ సెంటర్‌లో అద్దాలు ఇస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకలద్వారా నీటి సరఫరా



ట్యాంక్ ద్వారా నీటిని అందిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు : మండల పరిధిలోని గూడెం చెరువు పంచాయతీలో ఇటీవల ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురవడంతో తాగు నీటికి సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో గూడెంచెరువు వాసులు తాగు నీటికి ఇబ్బంది పడుతున్నారన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్ రెడ్డి ట్యాంకుల ద్వారా వారికి తాగునీటిని అందించాలని సర్పంచ్ నాగేశ్వరిని ఆదేశించడంతో ఆమె ట్యాంకుల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు.

భూముల ధరలపై సమీక్ష

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండల పరిధిలోని వ్యవసాయ, వ్యవసాయేతర భూములతోపాటు రాష్ట్ర, జాతీయ రహదారుల సమీపంలో ఉన్న భూముల ధరలపై సబ్ రిజిస్ట్రార్ రామలక్షుమ్మ మంగళవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో సబ్ రిజిస్ట్రార్ తహసీల్దార్ నజీర్ అహ్మద్, వీఆర్‌ఓలతో చర్చించారు. దొరసానిపల్లె, ప్రొద్దుటూరు, కొత్తపల్లె, తాళ్లమాపురం, రామేశ్వరం, సర్వీరెడ్డిపల్లె, మోడంపల్లె ప్రాంతాల్లో భూముల ధరలు ఏవిధంగా ఉన్నాయి, వ్యవసాయేతర భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ ధరలకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపేందుకు ఈ సమీక్ష చేసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు మనోహర్‌రెడ్డి, సుదర్శన్, సతీష్, ఆర్ఐ నాగమోహన్ రెడ్డి, ఆయా గ్రామాల వీఆర్ఓలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరి ఆర్థిక బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : కుటుంబంలోని ప్రతిఒక్కరినీ ఆర్థికంగా బలోపేతం చేయడమే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులు రెడ్డిలు తెలిపారు. మంగళవారం కొలుములపల్లె పంచాయతీ పరిధిలోని లింగారెడ్డిపల్లె, లక్కిరెడ్డిపల్లె గ్రామాల్లో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి ప్రతి కుటుంబానికి కుల, మత, రాజకీయ భేదాలు లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా అధికారులు కృషి చేస్తున్నారన్నారు. గ్రామంలో నూతన రోడ్లు, పింఛన్లు, రేషన్ కార్డులు, ఇంటి స్థలాలు, నూతన పక్కాగృహాలు కావాలని ఎమ్మెల్యే దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. ఆయన అక్కడే ఉన్న అధికారులతో చర్చించి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కో–కన్వీనర్ కళా యాదవ్, మాజీ కన్వీనర్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, సింగిల్ విండో ప్రెసిడెంట్ గజ్జల శ్రీరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీలు నాగరాజు, వెంకటరెడ్డి, సర్పంచ్‌లు రాజశేఖర్‌రెడ్డి, మల్లికార్జున యాదవ్, సుబ్బరాయుడు, సురేంద్రా రెడ్డి, రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

అరటి పరిశోధనా కేంద్రం పరిశీలన



అరటి పరిశోధనా కేంద్రాన్ని పరిశీలిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, తదితరులు

పులివెందుల రూరల్ : మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లె సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న అరటి పరిశోధనా కేంద్రాన్ని మంగళవారం మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సీఈ శ్రీనివాస్, ఏడీ వెంకటేశ్వర్లు, డీహెచ్ఓ మైఖేల్‌రాజీవ్, ఏడీహెచ్ సుభాషిణి, డీఈ పాహిం, ఈఈ వెంకటేశ్వరరావు, విజిలెన్స్ జెడీ రాజశేఖర్‌లు పరిశీలించి మాట్లాడారు. రూ.13 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏసీ గోదాములలో రైతులు అరటి నిల్వ చేసుకునేందుకు వీలుగా నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ పనులన్నింటిని రెండు మాసాల నాటికి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. రూ.70లక్షల వ్యయంతో అరటి ఫ్యూస్, అరటి చిప్స్ తయారు చేసే కేంద్ర నిర్మాణ పనులను వారు పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పనులలో నాణ్యత కోల్పోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రవీంద్రనాథరెడ్డి, హెచ్ఓ రాఘవేంద్రారెడ్డి, మార్కెటింగ్ ఏడీ అజాద్ వలి, మార్కెటింగ్ ఏఈ మేఘనాథ్, వైఎస్సార్ హార్టికల్చర్ యూనివరిశటీ డైరెక్టర్ శివప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో మాలెపాడు



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి

– ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని మాలెపాడు గ్రామం అభివృద్ధి పథంలో నడుస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాలెపాడు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి అనంతరం వారి సమస్యలను తెలుసుకుని అక్కడే ఉన్న అధికారుల సమక్షంలో పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ఈ మాలెపాడు గ్రామాన్ని ఎంపీ రమేష్ దత్తత తీసుకున్నారన్నారు. అయితే అభివృద్ధి మాత్రం చేయలేదన్నారు. ప్రస్తుతం మాలెపాడు గ్రామంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రతి వీధుల్లో రోడ్లు వేశామన్నారు. ఏ గ్రామంలో చూసినా గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్, డిజిటల్ లైబ్రరీలు నిర్మించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి, మాలెపాడు గ్రామ సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కొండాపురం సీఐ సుదర్శన్ ప్రసాద్, తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ రవికుమార్‌లు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలను అందజేస్తా



యాగశాలలో పూర్ణాహుతి గావిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



గ్రామోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు

– ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

లింగాల : శ్రీసీతారామ లక్ష్మణసమేత ఆంజనేయ స్వామి ఉత్సవ విగ్రహాలను వేద పండితులకు వితరణగా అందజేస్తామని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తెలిపారు. మంగళవారం దిగువలింగాల గ్రామంలో పునఃనిర్మించిన కోదండరామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీని వేద పండితులు పూర్ణ కుంభంతో ఆహ్వానించారు. ఆయన సీతారాముల కల్యాణానికి పట్టు వస్త్రాలను బహూకరించారు. అనంతరం యాగశాలలో పూర్ణాహుతి గావించారు. ఈ సందర్భంగా పంచాంగం రామ్‌కుమార్ శర్మ ప్రతి పౌర్ణమి రోజున ఒక్కొక్క గ్రామంలో సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఉత్సవ విగ్రహాలను అందించాలని ఎంపీని కోరగా ఆయన స్పందిస్తూ ఉత్సవ విగ్రహాలను వితరణగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఆలయాల పునఃనిర్మాణానికి, నూతన ఆలయాల నిర్మాణానికి సుమారు రూ.70 కోట్లు వెచ్చించామన్నారు. శ్రీగండి ఆంజనేయస్వామి ఆలయానికి రూ.15 కోట్లు వెచ్చించామన్నారు. అదేవిధంగా మండల కేంద్రంలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, లింగాల కుడికాలువ నుంచి లింగాల చెరువులకు ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ పి.వి.సుబ్బారెడ్డి, యూత్ కన్వీనర్ మనోహర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు బాబు రెడ్డి, వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంటరీ కన్వీనర్లు సారెడ్డి చంద్రశేఖరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అనసూయమ్మ, కొండారెడ్డి, వివిధ గ్రామాల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీసీతారాముల గ్రామోత్సవం

స్థానిక నూతన కోదండరామస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభారోహణ కార్యక్రమాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం హోమాలు, సాయంత్రం సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి నూతన శిలా విగ్రహాలు, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మైదుకూరుకు చెందిన ఉమామహేశ్వరి ఈవెంట్స్ వారిచే దేవతామూర్తుల వేషధారణలో క్లాసికల్ డ్యాన్స్ భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

నేడు విగ్రహ ప్రతిష్ఠ : బుధవారం నూతన రామాలయంలో సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరగనుంది. అదేవిధంగా ధ్వజ స్తంభారోహణ, పూర్ణాహుతి, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. నెల్లూరు జాతి వృషభాలచే బండలాగుడు పోటీలు, రాత్రికి నెల్లూరుకు చెందిన శ్రీసాయి ఈవెంట్స్ వారిచే ఆర్కెస్ట్రా నిర్వహించనున్నారు.

వ్యవస్థలపై నమ్మకంతో వ్యవహరించాలి

బీటెక్ రవి తీరుపై ధ్వజమెత్తిన వైకాపా నాయకులు

పులివెందుల : వ్యవస్థపై నమ్మకంతో ఏదైనా విషయంపై చర్చించి పరిష్కరించుకోవాలి తప్ప మంది మార్బలంతో వెళ్లి దౌర్జన్యకాండకు పూనుకోవడం తెలుగుదేశం నాయకులకు చెల్లుబాటు అవుతుందని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైకాపా నాయకులు ధ్వజమెత్తారు. ఇటీవల చక్రాయపేట మండలం నాగులగుట్టపల్లెలో జరిగిన సంఘటనపై మంగళవారం వైకాపా నాయకులు వైఎస్ మనోహర్ రెడ్డి ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నాగలగుట్టపల్లె గ్రామంలో ఇటీవల భూ వివాదానికి సంబంధించి బిటెక్ రవి, అతని అనుచర వర్గం బీభత్సం సృష్టించి భూములు ఆక్రమించారంటూ ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ఆ వివాద భూమికి సంబంధించిన పత్రాలను మా నాయకుల వద్ద ఉన్నటువంటి పత్రాలను ఉన్నతాధికారుల సమక్షంలో నిరూపించుకుని సమస్య పరిష్కారానికి కృషి చేయాలి తప్ప ఇలా మంది మార్బలంతో దౌర్జన్యానికి దిగడమేంటన్నారు. బీటెక్ రవికి జిల్లా నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు అచ్చం నాయుడు వత్తాసుపలకడం దేనికి సంకేతం అని, ఇలాంటి ఆలోచనలు గల వ్యక్తుల చేతిలోకి అధికారం వస్తే రాష్ట్రంలోని భూములను ఎక్కడ మిగలనివ్వరన్నారు. రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాష్ రెడ్డి ఆధ్వర్యంలో నిబద్ధత గల కార్యకర్తల్లాగా ప్రజా సంక్షేమం కొరకు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామే తప్ప ఎటువంటి అక్రమాలకు అవకాశాలు ఇవ్వకుండా పనిచేస్తున్నామన్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు చోట్ల గెలిస్తేనే టీడీపీ ప్రభుత్వం వచ్చినట్లుగా భావించి ఈ రకమైన చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. కార్యక్రమంలో ఏపీ సివిల్ సప్లైస్ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, రెండవ వైస్ చైర్మన్ హఫీజ్, మార్కెట్ యార్డ్ చైర్మన్ చిన్నప్ప, కౌన్సిలర్ కోడి రమణ, కో ఆప్షన్ చంద్రమౌళి, అంకాలమ్మ దేవస్థానం చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, వైకాపా నాయకులు బాదుల్లా, సంపత్, గంగాధర, ఓతూరు రసూల్, కనక, కోళ్ల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

వల్లూరు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ఉన్న కోదండరామాలయ దశ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వాములకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు జరుగుతాయి. మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. రాత్రి భజన కార్యక్రమాలు ఉంటాయన్నారు.

బండలాగుడు పోటీలు : వేడుకల్లో భాగంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి ఆరు పళ్ల విభాగం వృషభ రాజములచే బండలాగుడు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.25 వేలు, మూడవ బహుమతి రూ.20 వేలు, నాలుగవ బహుమతి రూ.15 వేలు, ఐదవ బహుమతి రూ.10 వేలు, ఆరవ బహుమతి రూ.8 వేలు, ఏడవ బహుమతి రూ.5 వేలు, ఎనిమిదవ బహుమతి రూ.3 వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

ఘనంగా 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం



స్టిక్కర్లను ప్రదర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల రూరల్ : మండలంలోని ఎర్రబల్లె-1 పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జేసీఎస్ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో కలిసి ప్రతి ఇంటికి వెళుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జరిగిన మోసాన్ని వివరిస్తూనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలు లబ్ధి పొందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలాగే ప్రజల సమస్యలను తెలుసుకుని సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ వరలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు డిష్ వెంకటరెడ్డి, రామమల్లేష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'ముద్రగడ'పై కేసు కొట్టివేత హర్షణీయం



ముద్రగడపై కేసు కొట్టివేసినందుకు వేడుకలు నిర్వహిస్తున్న బలిజ సంఘ నేతలు

కడప కల్చరల్ : కాపు ఉద్యమ నాయకుడు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంపై తుని రైలు దహనం కేసు కొట్టివేయడంపై కడప నగరానికి చెందిన బలిజ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. మంగళవారం స్థానిక కృష్ణా సర్కిల్‌లోని శ్రీకృష్ణ దేవరాయులు విగ్రహం వద్ద బలిజ అభ్యుదయ సేవా సమితి (బాస్) అధ్యక్షులు దాసరి శివప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు బలిజ నేతలు సమావేశమై రాయల విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించి కేక్ కట్ చేసి పంచుకున్నారు. ముద్రగడ పద్మనాభం 2016 జనవరి 30న తలపెట్టిన కాపు గర్జన సందర్భంగా నాడు తుని రైలు దహనం ఘటనతో ఆయనకు ముడిపెట్టి మరికొందరితో కలిసి ఆయనపై అక్రమ కేసు నమోదు చేశారని, దాన్ని సోమవారం కొట్టివేయడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కేసులో ఉన్న అందరినీ నిర్దోషులుగా ప్రకటిస్తూ కోర్టు నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో బాస్ సంస్థ గౌరవాధ్యక్షులు ఏనుగుల వెంకట సుబ్బయ్య, రాయలసీమ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాము, కొమ్మినేని రాఘవేంద్ర, డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండయ్య, ఎస్ఆర్ఐ ట్రస్టు చైర్మన్ తోటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'నాడు– నేడు' విధుల్లో నిబంధనలను సడలించాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలోని నాడు– నేడు రెండవ విడత పనులు జరుగుతున్న పాఠశాలల్లో హెచ్ఎం, ఉపాధ్యాయులందరూ వేసవి సెలవుల్లో తప్పనిసరిగా హాజరు కావాలన్న నిబంధనలను సడలించాలని ఎస్టీయూ నాయకులు కోరారు. ఈ విషయమై మంగళవారం పాఠశాల విద్య ఆర్‌జేడీ వెంకటకృష్ణారెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, చెన్నకేశవరెడ్డి మాట్లాడుతూ నాడు– నేడుతో మౌలిక వసతులపరంగా పాఠశాలలు అభివృద్ధి కి ఉపాధ్యాయులుగా సహకరిస్తామన్నారు. కానీ సెలవు రోజుల్లో వంతుల వారీగా రోజుకొకరు హాజరై ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పనిచేయాలనే నిబంధనలు సరికాదన్నారు.

అన్నదానం



అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సభ్యులు

జమ్మలమడుగు : జయశాలి చారిటబుల్ ట్రస్టు ఆల్ ఇండియన్ ట్రూ క్రిస్టియన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జ్యోతిమనోవికాస కేంద్రంలోని మానసిక వికలాంగులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు . కార్యక్రమంలో కమిటీ అధ్యక్షురాలు విజయలక్ష్మీ, సభ్యులు మేరి సుమతి, రమ్య, కావేరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

చెన్నూరు : చెన్నూరు మైనార్టీ కాలనీలో నివాసముంటున్న పార్టీ నేత గౌస్ తల్లి షకీనా మంగళవారం మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి గౌస్ నివాసానికి వెళ్లి షకీనా మృతదేహానికి ఘనంగా నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ చీర్ల సురేష్ యాదవ్, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ, గర్ల్స్ ఐటీఐ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలకు ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లలో 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కెనరా బ్యాంకు రూరల్ సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8 నుంచి ప్రారంభమయ్యే ఈ శిక్షణకు 18 నుంచి 45 ఏళ్లలోపు కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9440905478, 6302833546 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

దుర్గమ్మ సన్నిధిలో దోష నివారణ పూజలు

కడప కల్చరల్ : కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలు నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు పూజా విధానాన్ని తెలుపుతూ కార్యక్రమాన్ని నిర్వహింపజేశారు. భక్తులు ఈ సందర్భంగా అమ్మవారికి నిమ్మకాయ దీపాలను వెలిగించి మొక్కుకున్నారు.

వాహనాల వేలం

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక జమ్మలమడుగు రోడ్డులోని స్పెషల్ బ్యూరో ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయ ఆవరణలో బుధవారం వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను బహిరంగ వేలం వేయనున్నట్లు సెబ్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వా రు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు. మరిన్ని వివరాలకు సెబ్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

దోమల నియంత్రణ మనందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న డాక్టర్ రేష్మా, తదితరులు

తొండూరు : దోమల నియంత్రణ మనందరి బాధ్యత అని పీహెచ్‌సీ డాక్టర్ రేష్మా తెలిపారు. మంగళవారం తొండూరు పీహెచ్‌సీలో ఆశా డే సందర్భంగా వైద్యాధికారి రేష్మా ఆధ్వర్యంలో మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కొరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మలేరియా యూనిట్ అధికారి సిద్ధయ్యతో కలిసి ల్యాబొరేటరీని పరిశీలించి మలేరియా కేసులు ఏవైనా ఉన్నాయా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నీరు నిల్వ ఉండటంవల్ల దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. దోమకాటువల్ల ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయన్నారు. దోమలు పుట్టకుండా, కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రివేళల్లో దోమ తెరలు తప్పనిసరిగా ఉపయోగించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించేలా ప్రజలకు ఆరోగ్య, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య, సూపర్‌వైజర్ శశికళ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు



ఉద్యోగం పొందిన విద్యార్థులతో మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, తదితరులు

సింహాద్రిపురం : స్థానికంగా ఉన్న నిడివెల్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నలుగురు విద్యార్థులకు చెన్నైకి చెందిన గాబ్రిల్ లిమిటెడ్ ఇండియా సంస్థలో ఉద్యోగ అవకాశాలు లభించాయని కళాశాల ప్రిన్సిపాల్ తాతాజీ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కళాశాలలో చదివిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించడంతో కళాశాల పూర్వపు విద్యార్థులు నిర్వహించిన విజయోత్సవ సభలో పాల్గొన్న మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి విద్యార్థులను అభినందించా రు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, కళాశాల అధ్యాపకులు, పూర్వపు విద్యార్థులు పాల్గొన్నారు.

డీఎస్సీ-98 అభ్యర్థులందరికీ ఉద్యోగాలు ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్ : డీఎస్సీ–1998 అర్హులైన అందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని సోమవారం కడప కలెక్టరేట్, డీఈఓ కార్యాలయం ఎదుట అభ్యర్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 580 మంది అభ్యర్థులకు సంబంధించిన జాబితాను వెరిఫికేషన్ ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయానికి విద్యాశాఖ అధికారులు పంపించారన్నారు. జిల్లాలో కేవలం 172 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా జిల్లాలో మిగిలిన 408 మంది డీఎస్సీ 98 అభ్యర్థులు ఉద్యోగాలకు దూరమయ్యే పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి 98 అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులు మురళీమోహన్‌రెడ్డి, ఎరుకలయ్య, చంద్రమౌళి, శివాజీ, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఉద్యమ మార్గదర్శకుడు దాచూరి



దాచూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయ ఉద్యమ మార్గదర్శకుడు, విద్యారంగ సంక్షేమ కోసం అలుపెరగని పోరాటాలు చేసిన మహోన్నత వ్యక్తి అమరజీవి దాచూరి రామిరెడ్డి అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు అన్నారు. దాచురి రామిరెడ్డి ఏడవ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాచూరి రామిరెడ్డి ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమానికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. జిల్లా కార్యదర్శులు మస్తానయ్య, ఏజాస్, అహ్మద్ నాయకులు దేవదత్తం, శ్యాంసుందర్, జహీర్ అబ్బాస్, సీవీఎస్ఎన్‌బాబు, అబ్దుల్‌గని, జాబీదు, ప్రకాష్ బాబు, గౌరీ శంకర్ పాల్గొన్నారు.

పేదలకు పండ్లు, బిస్కట్లు పంపిణీ

వైవీయూ: కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు, పాతబస్టాండు సమీపంలోని పేదలకు కడప ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో అరటిపండ్లు, మల్టీవిటమిన్ బిస్కట్ ప్యాకెట్, మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల జాయింట్ సెక్రటరీ కోట్ల సరస్వతి, డైరెక్టర్ ఎం. వివేకానందరెడ్డి మాట్లాడుతూ వేసవిలో పేదలకు తమవంతుగా పండ్లు, బిస్కట్లు, మజ్జిగ అందజేసినట్లు తెలిపారు. సిబ్బంది చంద్ర ఓబులరెడ్డి, వెంకటేష్, చంద్ర, సంధ్యారెడ్డి, బాబు పాల్గొన్నారు.